సాక్షి
కామారెడ్డి
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



వట్టిపోతున్న బోర్లు..
నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లో బోరుబావులు వట్టిపోతుండడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి.
- 8లో ▸



మారుమోగిన హనుమ నామం
బాన్సువాడ పట్టణంలోని సరస్వతి ఆలయ ప్రాంగణం మంగళవారం హనుమాన్ నామ స్మరణతో మారుమోగింది.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.3 /20.2

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బంగారం ధరలకు రెక్కలు

● 10 గ్రాములకు రూ. 93,850



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. మంగళవారం మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాములకు రూ.93,850లకు చేరింది. బంగారం ధరలు రోజుకో రికార్డును సృష్టిస్తుండడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో కొనుగోలుదారులే కాదు విక్రయదారులు కూడా ఆందోళన చెందుతున్నారు.

తెరసం జిల్లా కార్యవర్గం

కామారెడ్డి టౌన్: తెలంగాణ రచయితల సంఘం(తెరసం) జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శంకర్, కార్యదర్శి ప్రకాశ్‌ల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ సాగింది. గౌరవ అధ్యక్షుడిగా సిరిగాద శంకర్, అధ్యక్షుడిగా రుద్రంగి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా సుప్పని సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కైలాస్, భూమన్న, రమేశ్, కార్యదర్శులుగా సంతోష్, శ్రీరాం, హరికృష్ణ, రజనీకాంత్‌గౌడ్, సంజీవ్‌కుమార్, మహిళా కార్యదర్శిగా హిరణ్మయి, కార్యవర్గ సభ్యులుగా ప్రమోద్‌రాజ్, సుధాకర్, రాములు, మారుతి, ప్రశాంత్, గాయత్రి, సలహాదారులుగా నర్సింహారెడ్డి, చలపతి, చంద్రశేఖర్, పూర్ణచందర్‌రావు ఎన్నికయ్యారు.

'కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి'



మాట్లాడుతున్న పెంటయ్య

నిజాంసాగర్ : ఆదివాసి నాయక్‌పోడ్‌లకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో జిల్లా ఆదివాసి నాయక్‌పోడ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్‌నగర్, తాడ్వాయి, రాజంపేట మండలాల్లో రెవెన్యూ అధికారులు నాయక్‌పోడ్ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో జాప్యం వహిస్తున్నారన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో రాజీవ్ యువ వికాసం పథకానికి దూరం అవుతున్నామన్నారు. అధికారులు స్పందించి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, లేకపోతే మండలాలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు పుట్ట వెంకట్, సాయిలు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్‌కు మరో యువకుడు బలి

- రూ.5 లక్షలకుపైగా పోగొట్టుకుని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి
- మృతుడిది రూరల్ మండలం ఆకులకొండూర్



ఆకాశ్ (ఫైల్)

నిజామాబాద్ రూరల్: ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారిన ఓ యువకుడు లక్షల రూపాయాలు పోగొట్టుకుని చివరకు తన ప్రాణాలను తీసుకున్నాడు. సుమారు రూ.5లక్షలకు పైగా పోగొట్టుకోవడంతో ఆత్మహత్యకు యత్నించిన సదరు యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ రూరల్ మండలం ఆకులకొండూర్ గ్రామానికి చెందిన ఆకాశ్(24) ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. ఇటీవల లక్షల రూపాయలను గేమ్స్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఏమంటారోనని భయపడి ఐదారు రోజుల క్రితం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయమై రూరల్ సీఐ సురేశ్‌ను వివరణ కోరగా బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కామారెడ్డిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

సమీకృతం.. అసమగ్రం

సమీకృత మార్కెట్ భవనాల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ప్రభుత్వం మారినా వాటిని పూర్తి చేసే ప్రయత్నాలు జరగకపోవడంతో ప్రజలకు మార్కెట్ కష్టాలు తీరడంలేదు.

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని సమీకృత మార్కెట్ల నిర్మాణం
- మూడు బల్దియాలలోనూ అసంపూర్తిగా పనులు
- రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు
- ఇబ్బందిపడుతున్న విక్రేతలు, ప్రజలు



కామారెడ్డిలో రోడ్డు మీద కూరగాయల విక్రయాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో కామారెడ్డితో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాల్లో సమీకృత మార్కెట్లు నిర్మించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కానీ నిధులు, బిల్లుల సమస్యలంటూ కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను ఆపేశారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని గాంధీగంజ్‌లో రూ. 7.20 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్ పనులు మొదలుపెట్టారు. పిల్లర్లు నిర్మించి వదిలేశారు. అప్పటి అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్ కావడంతో అధికారులూ ఒత్తిడి తేలేదు. ప్రజాప్రతినిధులూ పట్టించుకోలేదు. దీంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అక్కడికి సమీపంలో రైతుబజార్‌ను నిర్మించి ఏళ్లు గడుస్తోంది. కనీసం కూరగాయల మార్కెట్‌ను కూడా నిర్వహించడం లేదు. దీంతో రైతుబజార్ నిరుపయోగంగా మిగిలింది. జిల్లా కేంద్రంలో డెయిలీ మార్కెట్ దళారుల చేతుల్లోకి వెళ్లడంతో రైతులకు స్థలం లేక రోడ్లపైనే కూరగాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో దుకాణాల యజమానుల నుంచి రైతులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ నుంచి కనీస సౌకర్యాలు కల్పించకుండానే రైతుల నుంచి తైబజార్ పేరిట అడ్డగోలుగా వసూలు చేస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. కొత్త బస్టాండ్ సమీపంలోని సీఎస్ఐ గ్రౌండ్‌లోనూ రైతులు కూరగాయలు అమ్ముతున్నారు. అక్కడ కూడా సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కూరగాయలు అమ్మాల్సి వస్తోంది.

బాన్సువాడలోనూ బ్రేక్



బాన్సువాడలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

బాన్సువాడ పట్టణంలోనూ సమీకృత మార్కెట్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. 2022 ఫిబ్రవరి 5న రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు మొదట్లో చురుగ్గా సాగాయి. స్లాబ్ వరకు వచ్చి ఆగిపోయాయి. పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి. బిల్లుల సమస్యలతోనే సదరు కాంట్రాక్టరు పనులు ఆపేసినట్టు తెలుస్తోంది.



బాన్సువాడలో రోడ్డు మీద కూరగాయల దుకాణాలు

ఎల్లారెడ్డిలో పిల్లర్లకే పరిమితం



ఎల్లారెడ్డిలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

ఎల్లారెడ్డి పట్టణంలోనూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పరిస్థితి అలాగే ఉంది. రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బిల్లుల సమస్యతో పిల్లర్లు, బీమ్‌లు వేసి వదిలేశారు. పనులు తిరిగి ఎప్పుడు మొదలుపెడతారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పట్టణ నడిబొడ్డున నిర్మాణాలు చేపట్టినా.. అవి పూర్తి కాకపోవడంతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు నామమాత్రపు స్పందన

- మూడు బల్దియాలలో కలిపి 17,293 దరఖాస్తులు
- ఫీజు చెల్లించినవారు 3,719 మంది
- ముగిసిన 25 శాతం రాయితీ గడువు



కామారెడ్డి బల్దియా వద్ద దరఖాస్తుదారులు

కామారెడ్డి టౌన్ : అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడం కోసం ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఇచ్చిన అవకాశానికి దరఖాస్తుదారులనుంచి స్పందన కరువయ్యింది. గత నెలాఖరుతో ఈ గడువు ముగియగా.. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో 21.50 శాతం దరఖాస్తుదారులు మాత్రమే పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మూడు మున్సిపాలిటీలలో కలిపి 17,293 దరఖాస్తులు రాగా.. 3,719 మంది ఫీజు చెల్లించి రాయితీని వినియోగించుకున్నారు. వీరి దరఖాస్తులను టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారంనుంచి క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేస్తారు. దరఖాస్తు తిరస్కరణకు గురైతే చెల్లించిన ఫీజులో 90 శాతం తిరిగి దరఖాస్తుదారుడి ఖాతాలో జమచేస్తారు.

మండలాల్లో 20 శాతమే..

ఎల్‌ఆర్‌ఎస్ -2020 కి సంబంధించి మండలాల్లోనూ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలు మినహా 22 మండలాలలో 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు 14,012 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 12,357 దరఖాస్తులను ఆమోదించారు. గతనెలాఖరులోగా 2,472 మంది దరఖాస్తుదారులు మాత్రమే స్పందించి ఫీజు చెల్లించారు. ఇంకా 9,885 మంది దరఖాస్తుదారులు స్పందించలేదు.

మున్సిపాలిటీలవారీగా దరఖాస్తుల వివరాలు..

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఆమోదించినవి	ఫీజు చెల్లించనవి	పెండింగ్‌లో ఉన్నవి
కామారెడ్డి	17,637	15,309	3,390	11,919
బాన్సువాడ	1,881	1,381	158	1,223
ఎల్లారెడ్డి	909	603	171	432

ఎన్‌డీసీసీబీ చరిత్రలో ఘన విజయం

- రూ.63కోట్ల ఎన్‌పీఏ రికవరీ.. రూ.304 కోట్ల పంట రుణాల పంపిణీ
- ఏటా ఏప్రిల్ 1న సంబురాల దినోత్సవంగా జరుపుకోవాలి
- చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పిలుపు



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: ఎన్‌డీసీసీబీ ఆధ్వర్యంలో 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌పీఏ రూ.63 కోట్లు రికవరీ చేయడంతోపాటు రూ.304 కోట్ల పంట రుణాలు పంపిణీ చేశామని, ఇది బ్యాంకు చరిత్రలోనే ఘన విజయమని చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. ఎన్‌పీఏ రికవరీ ఊహించలేనిదని, మరో 7.82 శాతం మాత్రమే ఎన్‌పీఏ మిగిలి ఉందని పేర్కొన్నారు. సీఈవో నాగభూషణం వందే అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరం అచీవ్‌మెంట్ సెలబ్రేషన్స్‌ను డీసీసీబీ సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ రమేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి సీఈవోతోపాటు పాలకవర్గ సభ్యులకు, సిబ్బందికి తినిపించారు. అనంతరం సిబ్బంది పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చరిత్రలోనే ఘన విజయం సాధించామని, బ్యాంకులో ప్రతిఏడాది ఏప్రిల్ 1న సంబురాల దినోత్సవంగా జరుపుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మిగతా ఎన్‌పీఏను రికవరీ చేసే వరకు పాలకవర్గం, ఉద్యోగులు విశ్రమించొద్దని సూచించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ. 781.82 కోట్ల డిపాజిట్లు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు రూ. 1,355.56 కోట్లు ఇచ్చామని గుర్తుచేశారు. బ్యాంకుకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి ఉద్యోగి కష్టపడాలన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ ఇచ్చే ప్రయత్నం పాలకవర్గం చేస్తుందని హామీనిచ్చారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, లింగన్న, సాయిరెడ్డి, పటేల్ రమేశ్, చంద్రునాయక్, జీఎంలు అనుపమ, సుమమాల, గజానంద్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఇస్కాన్ సమ్మర్ క్యాంపు

కామారెడ్డి అర్బన్ : ఇస్కాన్ కామారెడ్డి సెంటర్‌లో విద్యార్థులకోసం సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధి వెంకటదాసు ప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం 25వ తేదీన ప్రారంభమవుతుందని, వచ్చేనెల 11వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. వేసవి శిబిరంలో శ్లోకాలు, యోగా, మంత్రం, ధ్యానం, బొమ్మలు వేయడం, సంగీతం, నైతిక విద్య తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు ఇతర వివరాలకోసం 99129 16108, 99596 02551 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


ఎండల్లో.. కూడెల్లి పరవళ్లు

- కొండ పోచమ్మ సాగర్ ద్వారా గోదావరి జలాల రాక
- చెక్‌డ్యాంలు నింపుతూ ఎగువ మానేరులోకి చేరుతున్న నీరు

బీబీపేట : భూగర్భ జలాలు అడుగంటిపోతూ బోరుబావులు ఎత్తిపోతున్నాయి. నీరందక పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరును నింపడానికి కొండ పోచమ్మ సాగర్ ద్వారా వస్తున్న నీరు అన్నదాతల ఆశలను సజీవంగా నిలుపుతోంది.

కొండ పోచమ్మ సాగర్ ప్రాజెక్టు ద్వారా ఆరు రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి కొండ పోచమ్మ కెనాల్ ద్వారా కూడెల్లి వాగుకు నీటిని వదులుతున్నారు. ఈ నీరు గజ్వేల్, దుబ్బాక నియోజక వర్గాల మీదుగా ప్రవహించి జిల్లాలోని బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలోని చెక్‌డ్యాంలోకి చేరుతోంది. దాని నుంచి దిగువన ఉన్న చెక్‌డ్యాం నిండి ఎగువ మానేరులోకి ప్రవహిస్తోంది. జిల్లాలో రెండు చెక్‌డ్యాంలు నిండిన తర్వాత ఎగువ మానేరువైపు నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఎండాకాలంలో వాగు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. నీరందక ఎండుముఖం పట్టిన పంటలకు గోదావరి జలాలు ఊపిరి పోశాయని రైతులు పేర్కొంటున్నారు.

“ పంటలకు జీవం పోసినట్టయ్యింది



రెండెకరాలలో వరి సాగు చేస్తున్నాను. ఎండలు రోజురోజుకు మండుతుండడంతో పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. ప్రభుత్వం కూడెల్లి వాగులోకి నీళ్లను వదలడంతో ఎండుతున్న పంటలకు జీవం పోసినట్టయ్యింది. పంట చేతికి వస్తుందన్న నమ్మకం వచ్చింది.
– ప్రభాకర్, రైతు, మల్కాపూర్



తుజాల్‌పూర్ వద్ద వాగులో ప్రవహిస్తున్న గోదావరి జలాలు

సన్న బియ్యం.. నూకలే అధికం

- ఇరవై శాతానికి పైగానే నూకలు
- వండితే ముద్దగా మారుతున్న అన్నం
- పెదవి విరుస్తున్న లబ్ధిదారులు

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాప్‌ల ద్వారా సన్నబియ్యం పంపిణీకి మంగళవారం శ్రీకారం చుట్టింది. సన్న బియ్యం అనేసరికి లబ్ధిదారులు మొదటి రోజునే రేషన్ దుకాణాలకు తరలివచ్చారు. అయితే 20 శాతానికిపైగా నూకలు ఉండడం, దానికితోడు వండితే అన్నం ముద్దగా అవుతుండడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు.



రేషన్ బియ్యంలో నూకలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో 578 రేషన్ దుకాణాలున్నాయి. ఆయా దుకాణాల పరిధిలో ప్రతినెలా 2,53,303 కుటుంబాలకు 5,571 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. గత నెల వరకు దొడ్డు బియ్యం సరఫరా అయ్యేవి. ఈనెలనుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని సర్కారు నిర్ణయించి, ఇప్పటికే జిల్లాలోని ఆయా స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సన్న బియ్యాన్ని పంపించింది. ఇంకా కొన్ని దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మంగళవారం అన్ని గ్రామాలు, పట్టణాల్లో అధికార పార్టీ నేతలు దగ్గరుండి ప్రారంభించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

నాణ్యత తక్కువ..

రేషన్ షాప్‌ల ద్వారా సరఫరా చేస్తున్న సన్న బియ్యంలో నూకలు ఎక్కువగా ఉంటున్నాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. నాణ్యమైనవి ఇస్తే బాగుండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రేషన్ దుకాణాలకు నూకలు తక్కువగా ఉన్న బియ్యం సరఫరా అవగా, చాలా దుకాణాలకు సరఫరా అయిన బియ్యంలో నూక 20 శాతానికి మించి ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా మార్కెట్‌లో ఏ రకం బియ్యం కొనుగోలు చేసినా నూకలు కనిపించవు. రేషన్ బియ్యంలో కూడా నూకలు తక్కువగా ఉండేవి. సన్న బియ్యం వచ్చేసరికి నూకల శాతం పెరగడంతో లబ్ధిదారులు కొంత ఇబ్బంది పడుతున్నారు.

వానాకాలం సీజన్‌కు సంబంధించిన బియ్యం కావడంతో వండితే అన్నం మెత్తగా అవుతోందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇక నుంచి ప్రతినెలా ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యంలో నాణ్యతపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకం

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : రేషన్ షాప్‌ల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకమని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడ సహకార సంఘంలోని రేషన్ దుకాణంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పేదలకు 1,400 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేశామని, వెయ్యి ఇళ్లు కట్టించి ఇచ్చామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైందని, ఇంకా పేదలు ఇల్లు కట్టుకోవాలనుకుంటే రూ.5 లక్షలు ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్, సహకార సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లూర్‌లో..

బాన్సువాడ రూరల్ : కొల్లూర్‌లో మంగళవారం సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్‌వో మల్లికార్జున్, తహసీల్దార్ వరప్రసాద్, నాయకులు పోతారెడ్డి, రెంజర్ల సాయిలు, జనార్దన్‌రెడ్డి, రాచప్ప, మొగులయ్య, దుర్గారెడ్డి, సాయిలు పాల్గొన్నారు.



బాన్సువాడలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

క్లుప్తంగా

అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి

- ప్రజలను కోరిన ఎస్సైలు
- దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన



నస్రుల్లాబాద్/నిజాంసాగర్/మద్నూర్/గాంధారి : అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సైలు కోరారు. మంగళవారం జుక్కల్ మండల కేంద్రంలో ఎస్సై భువనేశ్వర్, గాంధారి మండలం సోమారం తండాలో ఎస్సై ఆంజనేయులు సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, అందరూ ఐకమత్యంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. దొంగతనాలు అరికట్టడానికి ప్రజలు సహకరించాలని నస్రుల్లాబాద్ ఎస్సై లావణ్య అన్నారు. మద్నూర్‌లోని అన్ని కాలనీల్లో ఆటోలో మైకొసెట్ ఏర్పాటు చేసుకొని తస్మాత్ జాగ్రత్త అంటూ పోలీసులు ప్రచారం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే ఓటీపీ నంబర్లు అడిగితే ఇవ్వరాదని సూచనలు చేశారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నిజామాబాద్ సిటీ: రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా యువజన విభాగం నేతలు పనిచేయాలని రాష్ట్ర నాయకులు సూచించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్ అధ్యతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు రంగనాథ్, వెంకటరామారావు మాట్లాడుతూ.. పార్టీలో యువజన కాంగ్రెస్ పునాది లాంటిదన్నారు. పార్టీ తీసుకునే ప్రతీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసే బాధ్యత యువజన కాంగ్రెస్‌దేనన్నారు. పార్టీ చేపట్టిన జై బాపు- జై భీం-జై సంవిధాన్ పాదయాత్రల్లో యువజన కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలని సూచించారు. నాయకులు విక్కీయాదవ్, నరాల నిహార్, అనుపాల్ కిరణ్, నరేందర్ గౌడ్, ఆదిత్య పాటిల్, ఇర్ఫాన్, రాజుగౌడ్, రషీద్, ముద్దసిర్ పాల్గొన్నారు.





శేర్‌ఖాన్‌పల్లిలో తగ్గిన నీటిధారలు



నీరుపోయని వ్యవసాయ బోరుబావి

వట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న పంటలు

- నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో పడిపోయిన భూగర్భజలాలు
- ఆందోళనలో రైతులు





శేర్‌ఖాన్‌పల్లి శివారులో ఎండిన వరిపంట

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని వెల్గనూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, మంగ్లూర్, మల్లూర్ తండా, మల్లూర్, ఒడ్డేపల్లి, జక్కాపూర్, నర్వ, శేర్‌ఖాన్ పల్లి, సింగితం గ్రామాల పరిధిలో వ్యవసాయ బోరుబావుల కింద సాగు చేసిన పంట పొలాలు ఎండుతున్నాయి. భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి. బోరుబావుల నుంచి నీరు రాకపోవడంతో పంటలకు సాగునీరు అందడంలేదు. ప్రధానంగా వరి పంటపొలాలకు తీవ్రమైన నీటి కష్టాలు ఎదురవుతున్నాయి.

జొన్న, మొక్కజొన్న పంటలకు నీటి కొరత ఏర్పడినా పంట నష్టం తక్కువగా ఉంది. వరి పంట సాగు కోసం ఎకరానికి రూ. 25 వేల వరకు రైతులు పెట్టుబడి ఖర్చులు చేశారు. పంట సాగు కోసం చేసిన పెట్టుబడి ఖర్చులతో పాటు ఆరుగాలం కష్టపడిన శ్రమ వృథా అవుతుందని రైతులు వాపోతున్నారు. వేల రూపాయలు ఖర్చు పెట్టినా పంటలు పశువులకు మేతపాలవుతుండటంతో కర్షకులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

పంట ఎండుతోంది



యాసంగి సీజన్‌లో నాలుగు బోర్ల కాడ ఆరు ఎకరాల్లో వరి, 1.5 ఎకరాల్లో జొన్న పంట వేశాను. బోర్లు ఎత్తిపోవడంతో పంట మొత్తం ఎండిపోతుంది. దోపుల్ పోసిన బోర్లు దోసేడన్ని కూడా పోస్తలేవు. పంట సాగు కోసం తెచ్చిన అప్పులు కుప్పగా మారాయి. ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి. – ఏముల కాశీరాం, శేర్‌ఖాన్‌పల్లి, రైతు

నెత్తిన బోనమెత్తి.. మోకాళ్లపై నడిచి వెళ్లి

- జాతర ఉత్సవాల్లో అమ్మవారికి బోనం సమర్పించిన బాలమణి
- గత 40 ఏళ్లుగా కొనసాగిస్తున్న ఆనవాయితీ



బోనమెత్తుకొని మోకాళ్లపై నడుస్తూ ఆలయానికి వెళ్తున్న బాలమణి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో జరుగుతున్న ఉగాది ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఓ భక్తురాలు నెత్తిన బోనమెత్తుకొని మోకాళ్లపై నడుచుకుంటూ అమ్మవారికి బోనం సమర్పించింది. మెదక్ పట్టణానికి చెందిన కొంగరి బాలమణి అనే భక్తురాలు మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నుంచి శ్రీ నల్లపోచమ్మ ఆలయం వరకు బోనమెత్తుకొని, మోకాళ్లపై నడుస్తూ..మధ్య మధ్యలో నృత్యాలు చేస్తూ వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించింది. దీంతో జాతరకు వచ్చిన భక్తులు బాలమణి బోనమెత్తుకొని ఆలయానికి చేరుకున్న తీరును ఆసక్తిగా తిలకించారు. కాగా బాలమణి గత 40 ఏళ్లుగా ఉగాది జాతర ఉత్సవాలలో ఇదే తీరుగా అమ్మవారికి బోనం సమర్పిస్తుంది. గోపాల్‌పేటలో జరిగే నల్లపోచమ్మ జాతరకు బాలమణి బోనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

భూముల వేలాన్ని ఆపాలి



తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిరసిస్తూ మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో సెంట్రల్ లైబ్రరీ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి శివ, నాయకులు తరుణ్, సమీర్, అజయ్, అశోక్, రాము, పృథ్వీ, అనిల్, నరేందర్, శివ, అశ్విత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆటిజం దూరం

- బాల్యంలో వేధిస్తున్న మందబుద్ధి సమస్య
- ప్రతి వంద మంది పిల్లల్లో ఇద్దరికి వచ్చే అవకాశం
- నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం



నిజామాబాద్‌నాగారం: కొంతమంది ఏ సమస్య వచ్చినా వెంటనే గూగుల్ శోధించి ఉన్నవీ లేనివి తమకు ఆపాదించుకుంటారు. అనవసరమైన భయాందోళనలకు గురవుతుంటారు. తమ సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో తెలియకుండానే కొన్ని తప్పులు చేస్తుంటారు. ఈ క్రమంలో ఆటిజం సమస్య ఉన్న పిల్లల విషయంలో సైతం తల్లిదండ్రులు ఇలాంటి తప్పులు చేసే అవకాశం ఉంది. నేడు 'ప్రపంచ ఆటిజం దినోత్సవం' సందర్భంగా పిల్లలకు ఆటిజం ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.. పేరు పెట్టి పిలిచినా పలకకపోవడం, ఐ కాంటాక్ట్ సరిగా లేకపోవడం, వారి వంక చూసి నవ్వినప్పుడు తిరిగి నవ్వకపోవడం.. వంటి లక్షణాలు ఆటిజం సమస్య ఉన్న పిల్లల్లో కనిపిస్తుంటాయి. జన్యుపరమైన, ఇతరత్రా వివిధ కారణాల వల్ల మన దేశంలో ప్రతి వంద మంది చిన్నారుల్లో ఇద్దరు ఇలాంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

వాటిని నమ్మడం ఆపేయండి

ఇంటర్నెట్ వ్యాప్తి పెరిగిన తర్వాత ఏ సమస్య వచ్చినా గూగుల్ చేస్తున్నారు. అందులో చెప్పిన విషయాలను ఆచరించడానికి ప్రయత్నిస్తుంటారు. అయితే కొన్ని రకాల సమస్యల విషయంలో ఇది సరైన మార్గం కాదంటున్నారు నిపుణులు. ఇంటర్నెట్లో ఎంతో సమాచారం ఉంటుంది. ఇందులో సంబంధం లేని సమాచారం కూడా ఉంటుంది. దీని వల్ల మరికొన్ని అనుమానాలు పుట్టుకొస్తుంటాయి. ఇది పిల్లల ఆరోగ్యంపై పడే అవకాశమూ ఉంటుంది. కాబట్టి, ఇంటర్నెట్లో ఉండే సమాచారాన్ని నమ్మకుండా మీకు అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత నిపుణుల అభిప్రాయం తీసుకోవడం ఉత్తమం.

సొంత చికిత్స వద్దు..

ఈ రోజుల్లో ఏదైనా తెలియకపోతే యూట్యూబ్ చూసి నేర్చుకోవడం సాధారణంగా మారిపోయింది. కొంతమంది తల్లిదండ్రులు ఆటిజం సమస్య గురించి యూట్యూబ్‌లో వెతికి ఇంట్లోనే వారికి శిక్షణ ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటారు. ఇది ఏమాత్రం మంచిది కాదు. ఎందుకంటే ఆటిజం లక్షణాలు అందరిలో ఒకేరకంగా ఉండకపోవచ్చు. దీనికి స్పష్టమైన చికిత్స అంటూ ఏదీ లేదు. లక్షణాలను బట్టి ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియరల్ థెరపీ.. వంటివి ఇస్తుంటారు. కాబట్టి, సంబంధిత నిపుణులను సంప్రదించి వారు చెప్పే జాగ్రత్తలు పాటించడం మంచిది.

బలవంతం చేయొద్దు

ఆటిజం ఉన్నవారిలో కొంతమంది తమ కంటే తక్కువ వయసున్న పిల్లల్లాగా ప్రవర్తిస్తుంటారు. అయితే తల్లిదండ్రులు మాత్రం పిల్లలు ఏ వయసులో చేయాల్సిన పని ఆ వయసులో చేయకపోతే కంగారుపడుతుంటారు. కొంతమంది బలవంతం కూడా చేస్తుంటారు. ఉదాహరణకు ఓ ఏడేళ్ల అమ్మాయి ఇంకా నర్సరీ రైమ్స్ చూస్తుంటే కొంతమంది తల్లిదండ్రులు ఇబ్బంది పడుతుంటారు. ఇవి వారి కంటే చిన్న పిల్లలు చూడాల్సినవని.. వారి వయసులో చూడాల్సిన ప్రోగ్రామ్స్‌ను బలవంతంగా చూపించే ప్రయత్నం చేస్తుంటారు. దీనివల్ల వారు వాటిని చూడకపోగా మరింత కుంగుబాటుకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, వారికి నచ్చని విషయాల్లో బలవంతం చేయకపోవడమే మంచిది.

అవగాహన.. మద్దతు అవసరం



ఆటిజం ఉన్న పిల్లలకు సమాజం, ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు కలిసికట్టుగా మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు సమయానికి వైద్య సలహా తీసుకోవడం, సమగ్ర విద్య విధానాలను అమలు చేస్తే బాగుంటుంది.

– ప్రొఫెసర్ విశాల్, న్యూరోసైకియాట్రిస్ట్

ఇతరులతో పోల్చకండి..

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోలుస్తుంటారు. వారిలాగా ఉండమని తమ పిల్లలకు చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల ఆటిజం సమస్యలు తగ్గుతాయని భావిస్తుంటారు. అయితే ఈ పద్ధతి ఏమాత్రం మంచిది కాదు. ఎందుకంటే ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. అలాగే ఆటిజం ఉన్న వారిలో కూడా ఎన్నో నైపుణ్యాలు ఉంటాయి. ఇలా ఆటిజం ఉన్నప్పటికీ అపురూప విజయాలు సాధించిన వ్యక్తులు ఎంతోమంది ఉన్నారు. కాబట్టి, ఇలాంటి వారిని ఉదాహరణగా తీసుకుని పిల్లల్లోని ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి దానికి తగ్గ తోడ్పాటు అందించాలి. అంతేకానీ ఇతరులతో పోల్చకూడదు.

అలరించిన కుస్తీ పోటీలు



కొమలంచ గ్రామంలో కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

నిజాంసాగర్/ఎల్లారెడ్డిరూరల్ : మహమ్మద్ నగర్ మండలం కొమలంచ గ్రామంలో, ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. నల్లపోచమ్మ, ఉగాది ఉత్సవాల్లో భాగంగా మల్లయోధులకు కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీపోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నిర్వాహకులు నగదును బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో కుస్తీపోటీల నిర్వహకులు గంగారెడ్డి, నాగభూషణం గౌడ్, సాదులసత్యనారాయణ, పోతాగౌడ్, సిద్ధు ఉన్నారు.

నేడు కోనాపూర్ గ్రామంలో కుస్తీపోటీలు

బాన్సువాడ రూరల్: ఉగాది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో కుస్తీపోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి 5తులాల వెండి కడియం,ద్వితీయ బహుమతి 3తులాల వెండికడియం, తృతీయ బహుమతి 2తులాల వెండికడియం బహుకరించనున్నారు.



ఎల్లారెడ్డి : రుద్రారంలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నందిపేట్: మండలంలోని ఉమ్మెడ శివారులోని గోదావరి నది బ్యాక్ వాటర్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు నందిపేట ఎస్సై చిరంజీవి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గోదావరి నదిలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి జాలర్ల ద్వారా మృతదేహాన్ని బయటకు తీశామన్నారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తించడానికి వీలు లేకుండా ఉందన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్, న్యూసెన్స్ కేసుల్లో పలువురికి శిక్ష

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పీఎస్ పరిధిలో స్పెషల్ డ్రైవ్, డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆర్మూర్ పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన దేవరాజుకు మూడు రోజుల సాధారణ జైలు శిక్షను ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. అలాగే కమ్మర్‌పల్లికి చెందిన షేక్ మునీర్ బైక్‌ను అత్యంత ధ్వనితో ఆర్మూర్ నగరంలో నడుపుతూ న్యూసెన్స్ సృష్టించడంతో అతనికి రెండు రోజుల సాధారణ జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బోధన్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌టౌన్: బోధన్ పట్టణ పీఎస్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతన్న వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి రెండు రోజుల జైలు శిక్షను విధించారని పట్టణ సీఐ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సీఐ సూచించారు.

యువకుడి అదృశ్యం



రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన కర్రోళ్ల విజయ్‌కుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గతేడాది ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. నాటి నుంచి మతిస్థిమితం సరిగా లేదు. గత నెల 11న ఇంట్లోంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో విజయ్‌కుమార్ భార్య ప్రియాంక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విజయ్ ఆచూకీ తెలిసిన వారు నంబర్ 87126 59876 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన వన్నె సుభాష్(42) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరికి చెందిన సుభాష్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని భార్య కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లి పోయింది. నాటి నుంచి సుభాష్ ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం ఇంటి నుంచి సుభాష్ బయటకు రాకపోవడంతో చుట్టు పక్కల వారు ఆయన తమ్ముడికి సమాచారం అందించారు. రాత్రి స్థానికులతో కలిసి తలుపులు తీసి చూడగా ఉరేసుకొని ఉన్నాడు. మృతుడి తమ్ముడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాడ్కోల్ చౌరస్తాలో చైన్‌స్నాచింగ్

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో మంగళవారం చైన్‌స్నాచింగ్ జరిగినట్లు సీఐ అశోక్ తెలిపారు. పిట్లం మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన బాల పోచవ్వ చౌరస్తాలో బస్సు ఎక్కుతుండగా దుండగులు ఆమె మెడలోని గుండ్లను అపహరించారు. సుమారు ఏడు గ్రాముల బంగారు గుండ్లు అపహరణకు గురయ్యాయని బాధితురాలు గుర్తించి బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతరలో తప్పిపోయిన పాప

- అక్కున చేర్చుకొని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



కుటుంబసభ్యుల చెంతకు చేరిన పాప

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో జరుగుతన్న నల్లపోచమ్మ జాతర ఉత్సవాల్లో మంగళవారంరాత్రి మూడేళ్ల పాప తప్పిపోయింది. ఆలయ పరిసరాలలో ఒంటరిగా ఏడుస్తూ నిలబడ్డ పాపను గమనించిన నాగిరెడ్డిపేట పోలీసులు అక్కున చేరుకొని తల్లిదండ్రుల వివరాలను రాబట్టారు. తన తండ్రి పేరు సురేందర్ అని, తల్లి పేరు సౌజన్య అని, తమ ఊరు గాజిరెడ్డిపల్లి అని మాత్రమే పాప తెలిపింది. దీంతో పాప తప్పిపోయిన విషయాన్ని, ఈమె కుటుంబసభ్యుల వివరాలను వారు సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. కొద్దిసేపటికీ పాప సంబంధీకులు ఆలయం వద్ద పోలీసుల వద్దకు చేరుకొని జాతరలో తప్పిపోయిన పాప తమ పాపేనని చెప్పారు. దీంతో పూర్తి విచారణ చేపట్టిన కానిస్టేబుల్ గంగారాం పాపను కుటుంబసభ్యులకు అప్పగించారు.

జీజీహెచ్‌లో బాలుడు..



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసు

ఖలీల్‌వాడి: నగరంలోని జీజీహెచ్ నుంచి తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన కేషిరెడ్డి లత తన రెండున్నరేళ్ల బాబును తీసుకుని గవర్నమెంట్ హాస్పిటల్‌కు వచ్చింది. ఈ క్రమంలో బాబు ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చాడు. బస్టాండ్ ఏరియాలో డ్యూటీలో ఉన్న మహిళా హెడ్ కానిస్టేబుల్ బాబును చేరదీసి తన తల్లికి అప్పగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని బయటకు వచ్చినప్పుడు వారిపై దృష్టి పెట్టాలని ఎస్‌హెచ్‌వో కోరారు.

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసపోయిన మహిళ

ఎల్లారెడ్డి: ఆన్‌లైన్ షాపింగ్‌లో ఓ మహిళ మోసపోయినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన శేర్ల భావన అనే మహిళ ఇన్‌స్టాగామ్‌లో గత నెల 26న ఆన్‌లైన్ షాపింగ్‌లో డ్రెస్ బుక్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి బుక్ చేసిన డ్రెస్ పంపుతున్నాం కానీ మీరాష్ట్రంలో ట్యాక్స్ చెల్లించాల్సి వస్తోంది మీరు ముందుగానే రూ. మూడు వేలు చెల్లిస్తే డ్రెస్ డెలివరీ కాగానే డబ్బులు రిటన్ వస్తాయని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన భావన విడతల వారిగా రూ. 40వేల118 చెల్లించింది. ఎంతకీ డ్రెస్, డబ్బులు రాకపోవడంతో ఆమె 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో రూ. 16వేలు హోల్డ్‌లో ఉన్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని, ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై సూచించారు.

అపరిచితులను చితకబాదిన గ్రామస్తులు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌లో ఇద్దరు అపరిచితులను గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి చితకబాదారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం బస్వాపూర్ బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒకరిని గ్రామస్తులు పట్టుకుని విచారించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో చితకబాదారు. అలాగే గ్రామంలో మరో వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో గ్రామస్తులు పట్టుకుని ప్రశ్నించి చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లగా గ్రామస్తులకు పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు గ్రామస్తుల చేతిలో గాయపడ్డ అపరిచితులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నేత మృతి

బోధన్‌టౌన్: బోధన్ ఏఎంసీ చైర్మన్, సీనియర్ న్యాయవాది వీఆర్ దేశాయ్ కుమారుడు ప్రీతమ్ దేశాయ్(46) మంగళవారం గుండె పోటుతో మృతి చెందాడు. బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మృతుడి నేత్రాలను కుటుంబీకులు లయన్స్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. అంత్యక్రియలు స్వగ్రామమైన రుద్రూర్ మండల కేంద్రంలోని నివాసం వద్ద బుధవారం ఉదయం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న సప్తగిరి అసోసియేట్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన యజమాని వెంటనే అగ్ని మాపకశాఖకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ. లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి



సిరికొండ: మండలంలోని తూంపల్లికి చెందిన దాసరి రజనీశ్(38) కొబ్బరి చెట్టు పై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై ఎల్ రామ్ మంగళవారం తెలిపారు. రజనీశ్ కొబ్బరికాయలు తెంపడానికి సోమవారం కొబ్బరి చెట్టు పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్బర్‌నగర్ శివారులో కారు బోల్తా



రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ శివారులో మంగళవారం కారు బోల్తా పడింది. కాగా కారులో ఉన్న వ్యక్తి పారిపోయినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న రుద్రూర్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి స్థానికుల ద్వారా ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఓ పోలీసు వాహనం వెంబడిస్తున్న సమయంలో కారు బోల్తా పడినట్లు తెలిసింది. కారును పోలీసులు ఎందుకు వెంబడించారు. కారు బోల్తాపడగానే అందులో ఉన్న వ్యక్తి ఎందుకు పారిపోయాడనేది వివరాలు తెలియరాలేదు. ఈ విషయమై స్థానిక ఎస్సై సాయన్న ను వివరణ కోరగా ప్రమాదానికి గురైన కారును రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్ట శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 4,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.